క్లుప్తంగా

సుంకులాపరమేశ్వరికి క్షీరాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ సుంకులాపరమేశ్వరి దేవి ఆలయంలో చండీ యాగాన్ని పురస్కరించుకొని రెండో రోజు మంగళవారం అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కలశాలతో క్షీరాభిషేకం జరిపించారు. అనంతరం వేదపండితులు వేదయుక్తంగా చండీ హోమం చేపట్టారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సేవలు ప్రశంసనీయం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(వ్యవసాయం): ఉర్దూ భాషను బలోపేతం చేయడానికి జమాన్ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. మంగళవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఏకే ఖాన్, రసూల్ అంజాద్‌బాషా, కౌన్సిలర్ ఆరీఫ్ నాయక్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో ఆరోగ్యం

గోస్పాడు: దోమల నియంత్రణతో ఆరోగ్యం చేకూరుతుందని స్థానిక వైద్యాధికారి గోపాల్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో స్థానిక వైద్యాధికారి ఇమ్రాన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ రమణమ్మ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

రుద్రవరం: అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఎంఈఓ కోటయ్య హెచ్ఎంలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 12లోపు పనులన్నీ పూర్తి కావాలని చెప్పారు. ఏఈ మధుసూదనరెడ్డి ఉన్నారు.

గడ్డి వామి దగ్ధం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఉశేన్‌వలి గడ్డివామి దగ్ధమైంది. గడ్డివామి నుంచి మంటలు చెలరేగడంతో గమనించిన గ్రామస్తులు ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. తనపై కక్షతో వామికి నిప్పు పెట్టి ఉండొచ్చని రైతు ఆరోపించారు.

అడ్మిషన్లు పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

శిరివెళ్ల: కళాశాలలో అడ్మిషన్లను పెంచాలని ఆర్‌జేడీ నాగలింగారెడ్డి ఆదేశించారు. మంగళవారం యర్రగుంట్ల జీటీఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. అధ్యాపకుల టీచింగ్ ప్లాన్లు, నోట్సు, డైరీలను పరిశీలించారు. అనంతరం కళాశాల డైలీ ఫీజు కలెక్షన్ రిజిష్టర్లు, టర్మ్ ఫీజ్ రిజిష్టర్లు, ట్యూషన్, స్పెషల్ ఫీజ్, క్యాష్‌బుక్స్‌లను తనిఖీ చేశారు. అధ్యాపకులకు తరగతుల నిర్వహణ, అడ్మిషన్లు, విద్యా ప్రమాణాలు, మెరుగైన ఫలితాలపై సూచనలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ఉన్నారు.

వసతులు కల్పించాలి

నంద్యాల(సిటీ): ఎండతీవ్రతను అనుసరించి కార్మికుల పని వేళల్లో మార్పు, మంచినీటి వసతిని కల్పించాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికులు పని చేసే ప్రాంతాలలో మంచి నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ కల్పించాలన్నారు.

వేడుకగా మారెమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: బాచేపల్లి తండాలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ జాతర సోమవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

సీమ సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: రాయలసీమ సమస్యలు పరిష్కరించాలని స్టీరింగ్ కమిటీ నాయకులు రమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎం.చింతకుంట్ల, జూలేపల్లె, నెహ్రూనగర్, ఎస్.నాగులవరం, పసురపాడు, గోస్పాడు తదితర గ్రామాల్లో మంగళవారం సంతకాలు సేకరించారు.

ఇది కదా.. అభివృద్ధి అంటే!

- ఎన్నికలు ఉంటేనే టీడీపీకి ప్రజలు గుర్తుకొస్తారా?
- 2017 ఉప ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి గెలిచారు
- నాడు ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఇచ్చిన చంద్రబాబు
- హామీలపై నిలదీసినందుకు ముస్లిం యువకులపై రాజద్రోహం కేసు
- నంద్యాల అభివృద్ధిని విస్మరించింది వాస్తవం కాదా?
- నేడు.. నంద్యాలలో అభివృద్ధి పరుగులు

మాటలకు.. చేతలకు పొంతన ఉండని పార్టీ అంటే వెంటనే గుర్తుకొచ్చేది టీడీపీ. ఎందుకంటే.. నంద్యాల ఉప ఎన్నికల సమయంలో అలవికాని హామీలిచ్చి.. గెలిచిన తరువాత వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ముస్లింలకు మంత్రి పదవి ఇస్తానని హామీనిచ్చినా.. కేవలం ఎన్నికల ముందు ఇచ్చి సరిపెట్టారు. హామీలపై ప్రశ్నించిన నంద్యాలకు చెందిన ముస్లిం యువకులపై రాజద్రోహం కేసు నమోదు చేయించారు నాటి సీఎం చంద్రబాబు నాయుడు. ప్రస్తుతం మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు చినబాబు లోకేష్ పాదయాత్ర పేరుతో వస్తున్నారు. నంద్యాల అభివృద్ధిని వారు గాలికొదిలేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతోంది.

నంద్యాల: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు ఎన్నికలు వస్తున్నాయంటేనే ప్రజలు గుర్తువస్తారని, ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడతారని నంద్యాల వాసులకు బాగా తెలుసు. 2017లో నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల సమయంలో చంద్రబాబు ఓట్ల కోసం ఇచ్చిన హామీలను నేడు లోకేష్ చేపట్టిన పాదయాత్ర నంద్యాల నియోజకవర్గానికి చేరుకుంటున్న సందర్భంగా ప్రజలు వాటిపైనే చర్చించుకుంటున్నారు. బాబు వస్తే జాబు వస్తుంది, రైతులకు, మహిళలకు పూర్తిస్థాయిలో రుణమాఫీ వంటి హామీలు ఏమో గాని ముఖ్యమంత్రిగా ఉప ఎన్నిక ప్రచారానికి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు విస్మయానికి గురయ్యారు. ఇదిలా ఉండగా.. నంద్యాల ఉప ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. నంద్యాలను జిల్లాగా చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే నంద్యాలను జిల్లాగా ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పరుగులు..

నంద్యాలను జిల్లా చేయడంతో పాటు రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. నంద్యాల సర్వజన ఆసుపత్రికి రూ.7కోట్ల మేర ఖర్చు చేసి అధునాతన హంగులతో తీర్చిదిద్దారు. ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఓపీ భవనం, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, నూతనంగా నిర్మించిన డీఈఐసీ, జీరియాట్రిక్ భవన నిర్మాణాలు పూర్తి చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పి దాదాపు 50 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 16 డాక్టర్ వైఎస్సార్ పట్టణ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాల కోసం రూ.27 కోట్లు వెచ్చించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల కోసం ఇప్పటికే రూ.47.60 కోట్లు నిధులు ఖర్చు చేశారు.



నూనెపల్లెలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వేసిన బీటీ రోడ్డు

ముస్లిం యువకులపై దేశద్రోహం కేసు..

చంద్రబాబు హయాంలో తన కేబినెట్‌లో చివరి వరకు ముస్లింలకు మంత్రి పదవి ఇవ్వకుండా ఎన్నికలు దగ్గర పడే సమయంలో మంత్రి పదవి ఇచ్చారు. 2018 గుంటూరులో జరిగిన నారా హమారా.. టీడీపీ హమారా ముస్లింల సభలో ముస్లింలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్లకార్డులు ప్రదర్శించినందుకు నంద్యాలకు చెందిన హబీబుల్లాతో పాటు మరో 8 మందిపై దేశద్రోహం కేసు పెట్టి చిత్రహింసలకు గురి చేసిన విషయం తెలిసిందే.

- రోడ్ల విస్తరణ చేపడుతున్నామని ఉప ఎన్నికల సమయంలో అడ్డగోలుగా ఇళ్లు, షాపులు కూల్చివేశారు. బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి కేవలం తన వర్గీయులకే నష్టపరిహారం చెల్లించారు.

2017 ఉప ఎన్నికలో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చారా..

- అమరావతి, కడప, కర్నూలులో మూడు హజ్ హౌస్‌లు నిర్మిస్తానని ఎక్కడా ఏర్పాటు చేయలేదు.
- రూ.5కోట్లతో నంద్యాలలోని పార్కులను అభివృద్ధి చేస్తానని, ఒక్క పార్కు అభివృద్ధి చేయలేదు.
- విశాఖ, తిరుపతి, చిత్తూరు తరహాలో నంద్యాలను సుందరీకరణ చేసి మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని చెప్పినా.. పనులే చేపట్టలేదు.
- రూ.150 కోట్లతో వెలుగోడు నుంచి నంద్యాలకు తాగునీటిని తీసుకొని వస్తానన్న మాట రిజర్వాయర్‌లో కలిసిపోయింది..
- జర్నలిస్టులందరికీ మూడు పడకల ఇళ్లు నిర్మించి ఇస్తానని, ఒక్క ఇల్లు ఇవ్వలేదు
- రోడ్ల వెడల్పు కార్యక్రమం, దుకాణాలు, ఇల్లు కోల్పోయిన వారికి మార్కెట్ విలువపై 2.5 రెట్లు అధికంగా పరిహారం ఇస్తానని తన వర్గీయులకే చెల్లించి చేతులు దులుపుకున్నారు.
- రూ.870 కోట్లతో 13వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని, పనులు మధ్యలో వదిలేశారు.



నాడు..టీడీపీ హయాంలో రెండు పిల్లర్లు వేసి వదిలేసిన కుందూ బ్రిడ్జి



ప్రస్తుతం చివరి దశకు చేరిన నిర్మాణం

- నంద్యాలలో రైతుబజార్, ఫిష్ బజార్ ఏర్పాటు చేస్తానని చెప్పినా వాటి ఊసే లేదు.
- నంద్యాలను సీడ్ హబ్‌గా అభివృద్ధి చేస్తానని చెప్పి నిర్మించలేదు.
- అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులను ఆదుకుంటానని.. ఇందుకు తనది పూచి అని చెప్పి బాధితులకు రూపాయి కూడా ఇప్పించలేదు.



అధునాతన హంగులతో ప్రభుత్వాసుపత్రి



ఆసుపత్రిలో అధునాతన సౌకర్యాలు కల్పించిన దృశ్యం



చురుగ్గా సాగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు



జిల్లా కలెక్టర్ కార్యాలయం

పట్టణంలో జోరుగా అభివృద్ధి పనులు..



నంద్యాల మిర్చి యార్డులో పంట అమ్ముకుంటున్న రైతులు

ఎమ్మెల్యే శిల్పా రవికిశోర్ రెడ్డి చొరవతో మున్సిపాలిటీ పరిధిలో రూ.28.29 కోట్లతో 122 సీసీ రోడ్లు, రూ.16.31 కోట్లతో 81 డ్రైనేజీ కాల్వలు, రూ.1.14 కోట్లతో నాలుగు పార్కులు ఏర్పాటు చేశారు. మూడున్నరేళ్లలో వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌లకు రూ.49.88 కోట్లతో 284 పనులను పూర్తి చేశారు. అమృత్ పథకంతో కలిపి పట్టణంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.3 కోట్లతో నూనెపల్లెలో ఉన్న ఫ్లై ఓవర్ నుంచి రైతునగరం వరకు బీటీ రోడ్డు వేశారు. రూ.92 లక్షలతో సలీనగర్, దేవనగర్‌ల మధ్య బ్రిడ్జి, శ్యాంనగర్, సరస్వతినగర్ మధ్య రూ.1.37 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. జిల్లా మిర్చి రైతుల కోసం నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు చేశారు. రూ.70లక్షలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు గదులు నిర్మాణంతో పాటు పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలను మంజూరు చేశారు.

గోస్పాడు మండలంలో ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోస్పాడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. జలజీవన మిషన్ పథకంలో భాగంగా ఆరు పనులను చేపట్టారు. వాటిలో ఒకటి వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టి మిగిలిన పనుల్లో 12కి.మీమేర పైప్‌లైన్ వేశారు. వీటి కోసం రూ.109.80 లక్షలు ఖర్చు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 12 గ్రామ సచివాలయాల్లో ఆరు పూర్తి చేయగా రూ.4.55 కోట్లు మంజూరయ్యాయి. మిగిలిన వాటి పనులు కొనసాగుతున్నాయి. 8 హెల్త్ క్లినిక్‌లకు రూ.1.40 కోట్లు మంజూరు చేసి 5 పూర్తి కాగా మిగిలినవి పనులు జరుగుతున్నాయి. అలాగే 12 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుకు రూ.2.61 కోట్లు మంజూరు చేయగా 8 భవనాలు పూర్తయ్యాయి. మరో నాలుగింటి కొనసాగుతున్నాయి. రెండు పాల కేంద్రాల నిర్మాణానికి రూ.35లక్షలు మంజూరయ్యాయి. రూ.5 కోట్లతో దీబగుంట్ల నుంచి గాజులపల్లె మెట్ట వరకు బీటీ రోడ్డుకు ఖర్చు చేశారు. 7 కి.మీ మేర మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.90 లక్షలు వెచ్చించారు. మండల పరిధిలోని గ్రామాల్లో రూ.15 కోట్లతో సీసీ రోడ్ల ఏర్పాటు చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నంద్యాల టౌన్ : ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యమని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఆర్. వెంకటరమణ, డాక్టర్ బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం నుంచి సాయిబాబానగర్ ఆర్చ్ వరకు వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమల నివారణకు ప్రజలు చర్యలీ తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. వైద్యులు ఓ. ప్రభావతి, చంద్రశేఖర్, జగదీశ్ చంద్రారెడ్డి, ఏఎంఓ వరప్రసాద్ రెడ్డి, హెచ్ఈ సరోజ పాల్గొన్నారు.

న్యాయం చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న రవికుమార్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారిపై రవికుమార్ ఒంటిపై డీజిల్ పోసుకుని మంగళవారం నిరసన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. బేతంచర్ల మండలం తొమ్మార్రి కొట్టాల గ్రామానికి చెందిన రవికుమార్ పొలంలో రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన కొందరితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. పోలీసులు కూడా న్యాయం చేయకపోవటంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న త్రీటౌన్ సీఐ నరసింహులు, సిబ్బంది రవికుమార్‌ను స్టేషన్‌కు తరలించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ శామూన్

నంద్యాల: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజూ లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి నివేదికలను హౌసింగ్ పీడీ, మున్సిపల్ కమిషనర్లకు పంపాలని చెప్పారు. హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ల వారీగా అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేసి బుధవారం సాయంత్రంలోపు తనకు సమర్పించాలని సూచించారు. హౌసింగ్ పీడీ రామశేషు, ఈఈ మాధవరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు

రుద్రవరం: రెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఉదయం నుంచి రాత్రిన వరకు వేద పండితులు వివిధ పూజలు, మూర్తి యంత్రాభిషేకం, గ్రామోత్సవం, హోమాలు, మహాస్నపనం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బీమా తక్షణ సాయం అందజేత

చాగలమర్రి: స్థానిక 12 వార్డు ఎస్సీ కాలనికి చెందిన బోడోళ్ల సుబ్బారాయుడు అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయంగా సోమవారం మృతుడి భార్య స్వర్ణలతకు సర్పంచ్ తులసమ్మ, ఈఓ సుదర్శనరావు రూ.10వేలు అందజేశారు.

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ వలిబాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, సచివాలయ వెల్ఫేర్ మనోహర్ మంగళవారం మృతుడి భార్య షేక్ గౌషియాకు తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు.

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

బొమ్మలసత్రం: యువగళంలో భాగంగా నంద్యాలకు నారా లోకేష్ వస్తున్న సందర్భంగా తెలుగు తమ్ముళ్ల ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో తన్నుకున్న సంఘటన మంగళవారం నంద్యాల పట్టణంలో చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రధాన అనుచరుడు ఉప్పరి సురేష్‌కుమార్ 8వ వార్డులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. అదే వార్డుకు చెందిన జియబాషా మాజీ మంత్రులు భూమా అఖిలప్రియ, ఫరూక్‌లకు సన్నిహితుడు కావడంతో తాను కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. దీంతో ఆగ్రహించిన సురేష్ వర్గం జియాబాషాపై దాడి చేశారు. దీంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే.. రాజ్ థియేటర్ వద్ద మాజీ మంత్రి ఫరూక్ వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అనుచరులు చింపేశారు.

నీటి కుంట పరిశీలన

దొర్నిపాడు: గుండుపాపల గ్రామంలోని నీటి కుంటకు ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఒట్టిపోయిన కుంటలో పూడిక తీత పనులు చేయించి కేసీ కెనాల్ నీటితో కుంటను నింపారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, పీఎస్ వెంకటనారాయణ ఉన్నారు.

బుడ్డా.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల: బుద్ధి లేని బుడ్డా రాజశేఖర్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. లోకేష్, చంద్రబాబు మెప్పు కోసం అసభ్య పదజాలంతో మాట్లాడినా మనసును నొప్పించారన్నారు. గతంలో స్వామి మాల వేసుకొని బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దుర్భాషలాడారన్నారు. చీటింగ్ చక్రపాణిరెడ్డి అంటూ తనకు పేరు పెట్టారని, అందుకే తాను లోఫర్ లోకేష్ అన్నానని చెప్పారు. టీడీపీ హయాంలో నీరు-చెట్టు పనుల్లో మూడు తరాలకు సరిపడేలా దోచుకున్నావని ఆరోపించారు. 'వర్ధన్ బ్యాంక్‌పై సీబీఐ విచారణ చేయించాలని చెబుతున్నావు కదా.. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా నువ్వే నాపైన నా సంతకాలతో ఫిర్యాదు చెయ్ అంటూ సవాల్ విసిరారు. ఆరోపణ రుజువైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా, అలా కాకపోతే నువ్వు తప్పుకుంటావా అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉండి టీడీపీకి అమ్ముడుపోయిన నువ్వు తన మాట్లాడే అర్హత లేదన్నారు. పూజారిని కొట్టి, ఆర్యవైశ్యుడిని బెదిరించిన నువ్వు.. నీతులు చెబితే ప్రజలు నమ్మరన్నారు. జగనన్న పుణ్యమా అని ఒక్కసారి గెలిచావ్, ఆ తరువాత మూడు సార్లు ఓడిపోయిన నువ్వు.. నా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, బండిఆత్మకూరు ఎంపీపీ సంజీవరెడ్డి, వెలుగోడు మండల కన్వీనర్ అంబాల ప్రభాకర్‌రెడ్డి, బండిఆత్మకూరు మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం



పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 2వ వార్డు మాల్దారిపేట కౌన్సిలర్ సాదిక్‌బాషాతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సమ్మద్, తమీమ్, కో-ఆప్షన్ సభ్యులు సలాముల్లా తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి



తువ్వపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్ఓ

రుద్రవరం: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ కోరారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య బృందం మంగళవారం గ్రామ సచివాలయం-1 పరిధిలోని తువ్వపల్లెలో పర్యటించారు. కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్ఓ తనిఖీ చేశారు. ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడుతూ ప్రతి నెల నిర్ణీత తేదీల్లో వైద్య బృందం పర్యటిస్తారని, వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రసాదు, శ్రావణి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా హరివరం గ్రామ సచివాలయంలో మంగళవారం వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ ఆధ్వర్యంలో గ్రామంలో 113 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, సునీల్‌బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణకు అందరూ ముందుకు రావాలని అహోబిలం అటవీ అధికారి మూర్తుజావలి కోరారు. పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం అహోబిలం గ్రామంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. అహోబిలం మఠం మేనేజర్ భద్రయ్య ఉన్నారు.

శిరివెళ్ల: పర్యావరణాన్ని రక్షించుకుందామని ఫారెస్ట్ ఆఫీసర్ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ రహిత జీవన శైలి మాసోత్సవాల్లో భాగంగా పచ్చర్ల గ్రామంలో ప్రజలకు అడవిని సంరక్షించుకోవడంపై అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయరాదని, ప్లాస్టిక్ వాడొద్దని, మొక్కలు పెంచుకోవాలని చెప్పారు. సర్పంచు పెద్ది రమణయ్య, డీఆర్ఓ రాజు, ఎఫ్‌బీఓలు రామారావు,హర్షద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆళ్లగడ్డ: నల్లగట్ల, బత్తలూరు మధ్య జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజి అనే యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన అంజి మోటార్ సైకిల్‌పై నంద్యాలకు వెళ్లి తిరిగి వెళ్తుండగా నల్లగట్ల సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగ గాయపడగా.. స్థానిక వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరసింహులు తెలిపారు. అలాగే.. పట్టణ శివారులోని చింతకుంట గ్రామానికి చెందిన చంటి మంగళవారం ట్రాక్టర్‌పై కూర్చుని పొలానికి వెళ్తుండగా అదుపతప్పి కింద పడ్డంతో గాయపడటంతో స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

20 నుంచి శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ శిక్షణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి సాఫ్ట్‌వేర్, రొబోటిక్ ప్రాసెస్ ఆటోమేటిక్ డెవలపర్ తదితర అంశాలపై నిర్వహించే 6 నెలల ఉచిత శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ 6300324076 నంబర్‌లోను సంప్రదించాలని సూచించారు.